ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్టం : 32.0 కనిష్టం : 24.0
ANDHRAJYOTHY 5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
గురువారం 5 జూన్ 2025



నారాయణపేటకు గ్రీన్ చాంపియన్ అవార్డు

- ప్రతీ రోజు 20 టన్నుల చెత్త తరలింపు
- డంపింగ్‌యార్డులో రీసైక్లింగ్
- చెత్తతో ఎరువులు, ఇటుకల తయారీ

6

డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను శుభ్రం చేసే యంత్రం



ఆగ్రహ జ్వాల

రణరంగంగా మారిన ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక ఉద్యమం

- పనుల ప్రారంభానికి వ్యతిరేకంగా కంటెయినర్, గుడారానికి నిప్పు
- గ్రామస్థులు, కంపెనీ సిబ్బందికి గాయాలు, పోలీసుల లాఠీచార్జి
- గత ప్రభుత్వంలో అనుమతులు, సమీప గ్రామస్థుల అభ్యంతరం
- గతంలోనూ నిరసనలు, ఆ సమయంలో పనులు నిలిపివేసిన కంపెనీ
- ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా పనులు చేపట్టడంపై ఆగ్రహం





కంటెయినర్‌కు నిప్పు పెడుతున్న నిరసనకారుడు, వాహనాన్ని బోల్తా పడేసిన నిరసనకారులు

మహబూబ్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/అలంపూర్ చౌరస్తా : జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ రణరంగంగా మారింది. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా 12 గ్రామాల ప్రజలు చేస్తున్న ఉద్యమం ఆగ్రహ జ్వాలగా మారింది. కంపెనీకి చెందిన కంటెయినర్, గుడారానికి నిప్పు పెట్టిన నిరసనకారులు.. బొలేరో, ఎర్త్‌మూవర్‌ను ధ్వంసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 2023 ఆగస్టు 28న గాయత్రి రెనివబుల్ ఫ్యూయల్స్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్‌ను గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయి. మొత్తం 30 ఎకరాల విస్తీర్ణంలో రూ. 200 కోట్ల పెట్టుబడితో సుమారు 100 మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ కంపెనీ ఏర్పాటు చేయనున్నారు. ఈ కంపెనీలో ఈబీపీ (ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రాం)లో భాగంగా రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్‌ను ఇందులో ఉత్పత్తి చేస్తారు. ఉత్పత్తి చేసిన ఇథనాల్‌ను ప్రభుత్వానికే విక్రయించడం ద్వారా రోజూ వినియోగించే పెట్రోల్‌లో ఈబీపీ కింద కలుపుతారు. దీనివల్ల కార్బన ఉద్గారాలను తగ్గించడంతో పాటు ఇతర దేశాల నుంచి ముడిచమురు దిగుమతికి ఖర్చు చేస్తున్న విదేశీ మారక నిల్వలను ఆదా చేయవచ్చనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నది. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మరికల్ మండలం చిత్తనూరు, కృష్ణా మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీలను నిర్మించారు. అక్కడ ఉత్పత్తి కూడా జరుగుతోంది. చిత్తనూరు వద్ద ఫ్యాక్టరీ నిర్మించినప్పుడు కూడా ఇదే విధంగా ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. నెలలపాటు నిరసన తెలిపినప్పటికీ కంపెనీ ఏర్పాటు పూర్తయ్యింది. ఇప్పుడు పెద్ద ధన్వాడలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ కూడా చిత్తనూర్,

(మిగతా 6లో..)



ఆందోళనలను అదుపులోకి తేవడానికి వచ్చిన పోలీసు బలగాలు

ప్రజాభీష్టం మేరకే అన్నారు



పెద్ద ధన్వాడలో కంపెనీ ఏర్పాటును మేము మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాం. గతేడాది చివరిలో కూడా కంపెనీ ఏర్పాటుకు ప్రయత్నిస్తే అడ్డుకొని ధర్నా చేశాం. మంత్రి శ్రీధర్‌బాబును, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలను కూడా కలిశాం, కలెక్టర్‌ను కలిసి ఫ్యాక్టరీ పనులు చేపట్టవద్దని కోరాం. వారు కూడా ప్రజాభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మళ్లీ మొన్న రాత్రి వచ్చారు. ఎందుకు వచ్చారని మా ఊరి పెద్దలు అడిగేందుకు వెళ్తే కర్రలు అడ్డంవేసి దాటి చూడండి అంటూ కవ్వించారు. దీంతో రాత్రి మా ఊరితో పాటు చిన్నధన్వాడ, మాన్‌దొడ్డి గ్రామాల్లో ఆలోచించి అడ్డుకోవాలని నిర్ణయించుకున్నాం.

\- కె.వెంకటేష్, పెద్ద ధన్వాడ, రాజోలి

చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు



ప్రజలు ఎవరైనా చట్టాన్ని వ్యతిరేకించే కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. రాజోలి మండలం పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు తెలపకుండా చట్టాలను అతిక్రమించినట్లు గుర్తించాం. ఆందోళనలో పాల్గొన్న వారు కంపెనీకి చెందిన ఆస్తులను ధ్వంసం చేశారు. వారిపై కఠిన చర్యలు ఉంటాయి. బుధవారం కంపెనీ ప్రాంతంలో జరిగిన ఆందోళనలను పరిశీలిస్తున్నాం. చట్టానికి వ్యతిరేకంగా నడుచుకున్న వారిపై చర్యలు ఉంటాయి.

\- మొగులయ్య, డీఎస్పీ, గద్వాల

క్రీడల హబ్‌గా తెలంగాణ

- క్రీడలకు రూ.460 కోట్ల బడ్జెట్
- సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ క్రీడాకారుడు
- రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుతామని ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి చెప్పారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఒకటవ తెలంగాణ అంతర్ జిల్లాల అండర్ 23 3ఇన్‌టూ3 మహిళలు, పురుషుల బాస్కెట్ బాల్ టోర్నీ నిర్వహిస్తున్నారు. బుధవారం పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పదేళ్లుగా బీఆర్ఎస్ సర్కార్ క్రీడలను పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వాలు క్రీడాభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ. 50 కోట్లు ఇస్తే, కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టిన గత ఏడాది రూ. 370 కోట్లు, ఈ ఏడాది రూ. 460 కోట్ల కేటాయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ క్రీడాకారుడు కాబట్టి క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. త్వరలో రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి రూ. 16 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇండోర్ స్టేడియంలో ఏసీ, స్టేడియంలో సింథటిక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే వాలీబాల్ అకాడమీ మంజూరైందని, సెలక్షన్ నిర్వహించి క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ స్థానంలో ఉండాలన్నారు. రాష్ట్రంలో బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని, రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడా పతాకాన్ని

(మిగతా 6లో..)

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- జడ్చర్లలో బాలుడు ఎర్తింగ్ వైరుకు తగిలి..
- వెంకటాయపల్లిలో ఎలక్ట్రీషియన్ ఎల్‌సీ తీసుకోకుండా పని చేస్తుండగా..

7

మునిసిపల్ ఉద్యోగిపై దాడికి యత్నం

- జీతాల్లో కోతపై ప్రశ్నించడంతో ఆగ్రహం
- సీనియర్ అసిస్టెంట్‌పై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

7

ముగ్గురు మహిళల అదృశ్యం

- వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఘటనలు

7

భూ సమస్యలు పరిష్కరించుకోండి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి
- కోయిలకొండ మండలం చంద్రాసుపల్లిలో రెవెన్యూ సదస్సు



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

కోయిలకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. బుధవారం కోయిలకొండ మండలం చంద్రాసుపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల గురించి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. భూ సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమస్య ఎన్ని రోజుల్లో పరిష్కారం అవుతుందో అధికారులు చెప్పాలని వెల్లడించారు. రోజు వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?, ఎన్ని పరిష్కరించారు? అన్నది నివేదికలు అందించాలన్నారు. అనంతరం గ్రామంలోని పల్లె దవఖానాను పరిశీలించారు. గ్రామంలో ఎంత మంది గర్భిణులు ఉన్నారు?, వారికి ఎలాంటి మందులు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వారికి రక్తహీనత లేకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామంలో డయాబెటిక్ రోగులు ఎంత మంది ఉన్నారని?, వారికి మందులు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజా గణేష్, రెవెన్యూ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం వికటించి బాలింత మృతి

6

- నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ముందు బంధువుల ఆందోళన

విద్యార్థుల ఇళ్లకే.. అధ్యాపకులు

- ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం వెళ్తున్న ప్రభుత్వ కళాశాలల బోధకులు
- అక్కడే ఆన్‌లైన్ యాప్ ద్వారా అడ్మిషన్



దామరగిద్దలో విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి అడ్మిషన్లు చేయిస్తున్న అధ్యాపకులు

నారాయణపేట, జూన్ 4: నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లకు శ్రీకారం చుట్టారు. అందుకోసం అధ్యాపకులు విద్యార్థుల ఇళ్ల వద్దకే వెళ్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, విద్యార్థులను అందులోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. విద్యార్థి ఏ గ్రూప్ తీసుకుంటారు?, సెకండ్ లాంగ్వేజ్ ఏ సబ్జెక్ట్ తీసుకుంటారు? అని అడిగి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. అప్పుడు విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. అది ఎంటర్ చేస్తే అడ్మిషన్ ఓకే అవుతుంది. పది రోజుల తర్వాత ఉత్తీర్ణత పత్రాలు, టీసీతో కళాశాలలకు రావాలని విద్యార్థులకు అధ్యాపకులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే న్యాణమైన్య విద్య

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని వసతులు ఉన్నాయి. ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నాం. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దాతల సహకారంతో నోట్ పుస్తకాలు అందిస్తున్నాం. న్యాణమైన విద్యను అందిస్తుండటంతో ఉత్తీర్ణలో ప్రభుత్వ కళాశాలలు ముందున్నాయి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

\- రాంరెడ్డి, అధ్యాపకుడు, దామరగిద్ద జూనియర్ కళాశాల, నారాయణపేట జిల్లా

35 ప్రభుత్వ కళాశాలలు

జిల్లాలో 35 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 10 జూనియర్ కళాశాలలు ఉండగా, కస్తూర్బాలు 11, మాడల్ స్కూల్స్ 2, ట్రైబల్ వెల్ఫేర్ 1, సాంఘిక సంక్షేమ గురుకులాలు 6, బీసీ వెల్ఫేర్ గురుకులాలు 3, మైనారిటీ గురుకులాలు రెండింటిలో కూడా ఇంటర్ విద్యను అందిస్తున్నారు. ఇవి కాకుండా 8 ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి.

పదో తరగతి జీపీఏ ఆధారంగా..

ఇంటర్ అడ్మిషన్లు పదో తరగతి జీపీఏ ఆధారంగా తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రతీ కళాశాలలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు పది శాతం, బీసీలకు 29 శాతం, వికలాంగులకు 3 శాతం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అర్హత కలిగిన వారికి 5 శాతం, ఎక్స్ సర్వీస్ పిల్లలకు 3 శాతం, ఈడబ్ల్యూఎస్ వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలిపింది. బాలికలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు.

రేపు మూసాపేటకు ఉప ముఖ్యమంత్రి

- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

మూసాపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం మూసాపేటకు రానున్న దృష్ట్యా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారి పక్కన అయ్యప్ప ఆలయ గుట్ట సమీపంలో సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మూసాపేటలో 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా వస్తారని, అనంతరం సభ ఉంటుందన్నారు. ఏర్పాట్లపై అధికారులు, కాంగ్రెస్ నాయకులతో సమీక్షించారు. సమావేశాన్ని విజయవంతం చేయడానికి ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎస్ఐ ఎం.వేణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, నాయకులు నాగిరెడ్డి, బగ్గి కృష్ణయ్య, బాలనర్సింహులు, రాంచందర్, నిరంజన్, బోయ కృష్ణయ్య, బోయ రవికుమార్, సురేష్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అండర్-19 క్రికెట్ టోర్నీలో.. మహబూబ్‌నగర్ దూకుడు

- 170 పరుగుల తేడాతో గద్వాలపై ఘన విజయం

7

- డబుల్ సెంచరీతో చెలరేగిన అబ్దుల్ రాఫె



డబుల్ సెంచరీతో రాణించిన అబ్దుల్ రాఫె

హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

- డీఐజీ ఆదేశాల మేరకు ఎస్పీ చర్యలు
- పాలమూరులో హాట్‌టాపిక్‌గా మారిన 'ఆంధ్రజ్యోతి' కథనం

మహబూబ్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సివిల్ విషయాలలో తలదూర్చి, వివాదాస్పద భూములను తక్కువ ధరకే రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాడన్న ఆరోపణలపై ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సదరు హెడ్‌కానిస్టేబుల్ తన గ్రామంలో వివాదాస్పద భూములు, లిటిగేషన్ వ్యవసాయ భూములలో తలదూర్చి తక్కువ ధరకు వాటిని సొంతం చేసుకుంటున్నారని ఎస్పీ కార్యాలయానికి పలువురు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఓ బాధిత మహిళతోపాటు ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో ఫిర్యాదుదారులు పేర్కొన్న అంశాలు వాస్తవమేనని డీఐజీకి నివేదిక సమర్పించారు. అప్పులు తీసుకున్నవారు అసలు, మిత్తీడబ్బులు తిరిగి ఇవ్వలేని స్థితిలో తక్కువ ధరకే వారి భూములను సొంతం చేసుకున్నట్లు విచారణలో తేలింది. దీనిపై డీఐజీ ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులు సదరు హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారమే ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులు మాత్రం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. కాగా ఈ బాగోతంపై 'ఖాకీ కాఠిన్యం' పేరిట రెండ్రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చకు దారితీసింది. పోలీస్‌శాఖలో ఇది హాట్‌టాపిక్‌గా మారింది. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తరువాత బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.


పేట డంపింగ్ యార్డులో యాంత్రల షెడ్స్


డంపింగ్ యార్డులో తడి,పొడి చెత్తను శుద్ధి చేస్తున్న యంత్రం

నారాయణపేటకు గ్రీన్ చాంపియన్ అవార్డు

» ప్రతీ రోజు 20 టన్నుల చెత్త తరలింపు

» డంపింగ్‌యార్డులో రీసైక్లింగ్

నారాయణపేట, జూన్ 4 : నారాయణపేట మునిసిపాలిటీ గ్రీన్ చాంపియన్ పురస్కారానికి ఎంపికయ్యింది. వనరుల సద్వినియోగం, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత అంశాల్లో సత్ఫలితాలు సాధించడంలో నారాయణపేట మునిసిపాలిటీ ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీజీ పీసీబీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించనున్న కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. గత ఏడాది కూడా మునిసిపాలిటీకి ఈ పురస్కారం లభించడం విశేషం. వన మహోత్సవంలో భాగంగా గత ఏడాది మునిసిపాలిటీ పరిధిలో 45,140 మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. అలాగే ఈ సారి వర్షాకాలంలో 20 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.


లోకపల్లి దగ్గర మునిసిపల్ నర్సరీలో చెట్లు


తయారు చేసిన ముడిసరకు

చెత్తతో ఎరువు, ఇటుకల తయారీ

నారాయణపేట మునిసిపాలిటీలోని 24 వార్డుల నుంచి ప్రతీ రోజు 20 టన్నుల చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అందులో 11 టన్నుల వరకు తడి, 8 టన్నుల వరకు పొడి చెత్త ఉంటోంది. ఒక టన్ను హానికరమైన వస్తువులు పోగవుతున్నాయి. డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తలను వేరు చేసి, యంత్రాలతో శుద్ధి చేస్తారు. పొడి చేత్తను సెగ్రిగేషన్ యంత్రంలో వేసి కట్టలు కట్టి కేటగిరీల వారీగా అట్టపెట్టెలు, దుస్తులు, ప్లాస్టిక్ బాటిళ్లు, సీసాలను వేరు చేస్తారు. వాటిని హైదరాబాద్, బెంగళూరులలోని సిమెంట్ పరిశ్రమలకు తరలిస్తారు. తడి చెత్తను బెడ్‌లుగా వేసి ఎరువులను తయారు చేస్తారు. ఈ ఎరువులు పంటల సాగుకు, హరితహారం మొక్కల పెంపకానికి ఉపయోగపడుతోంది. కరగని ప్లాస్టిక్ వస్తువులను చిన్నచిన్న ముక్కలుగా చేసి బ్రేకింగ్ మిషన్ ద్వారా ఇటుకలను తయారు చేస్తారు. వీటిని ఇటుకల బట్టీలు, పరిశ్రమల్లో బాయిలర్లకు కట్టెలకు బదులుగా వినియోగిస్తారు.

ఇలా నారాయణపేట మునిసిపాలిటీ డంపింగ్ యార్డులో చెత్తను రీసైకిలింగ్ చేసి, తయారైన వస్తువులను ఎగుమతి చేస్తూ సత్ఫలితాలు సాధిస్తుండటంతో ప్రభుత్వం గుర్తించింది. గ్రీన్ చాంపియన్ పురస్కారానికి ఎంపిక చేసింది.

సహకారం, సమష్టి కృషి



ప్రజల సహకారం, మునిసిపల్ సిబ్బంది సమష్టి కృషితో సత్ఫలితాలు సాధిస్తున్నాం. మునిసిపాలిటీ చేస్తున్న కృషిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి గ్రీన్ చాంపియన్ అవార్డుకు ఎంపిక చేయడంతో మా బాధ్యత మరింత పెరగనున్నది. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా భావించి, చెత్తను రోడ్లపై వేయకుండా సహకరించాలి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి.

- భోగేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

» సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ కల్కోట


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న క్రైం డీఎస్పీ గిరికుమార్ కల్కోట

చారకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ కల్కోట అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎస్ఐ ఎస్‌కే శంషుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సోషల్ మీడియాలో అపరచిత వ్యక్తులతో స్నేహం చేయొద్దన్నారు. ఎవరైన ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పకూడదని, లోన్ యాప్స్ ద్వారా రుణాలు తీసుకోవద్దని సూచించారు. మీరు బహుమతులు గెలుచుకున్నారంటూ వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. కార్యక్రమంలో తాహసీల్దార్ అద్దంకి సునీత, హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గజ్జె యాదయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచ్ నరేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, వెంకటయ్య గౌడ్, కలగోని నారయ్యగౌడ్, కుంబం కొండల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట జట్టు ఘన విజయం

» వనపర్తి జట్టుపై 62 పరుగుల తేడాతో గెలుపు


గెలుపొందిన నారాయణపేట జట్టు

నారాయణపేట, జూన్ 4 : అండర్ - 19 ఇంట్రా డిస్ట్రిక్ క్రికెట్ లీగ్ పోటీల్లో భాగంగా బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లో వనపర్తి జట్టుపై నారాయణపేట జట్టు 62 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన లీగ్ పోటీల్లో మొదట బ్యాటింగ్ చేసిన నారాయణపేట జట్టు 196 పరుగులు చేసింది. విష్ణు 51 పరుగులు, అవరన్ 39 పరుగులు, మహేశ్ 34 పరుగులతో రాణించారు. వనపర్తి బౌలర్లు రోహిత్ 4, చరణ్ 2, దినేష్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వనపర్తి జట్టు 134 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అంతకు ముందు డీఆర్‌డీవో మొగులప్ప పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీడీపీ అబ్జర్వర్ మన్నాన్, జిల్లా ఇన్‌చార్జి రమణ, జనార్దన్, అన్వర్ పాషా, కార్తిక్ పాల్గొన్నారు.

లక్ష రూపాయలు చోరీ

మక్తల్ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఓ రైతు హోటల్‌లో భోజనం చేసేందుకు చేతులు కడుగుకొని వచ్చే లోపు లక్ష రూపాయలు చోరీకి గురయ్యాయి. నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలో బుధవారం జరిగింది. బాధితుడి భార్య కురువ నాగప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాగనూరు మండలం, మందిపల్లి గ్రామానికి చెందిన రైతు కురువ నాగప్ప వడ్లు అమ్మిన డబ్బులను బ్యాంకు డ్రా చేసుకునేందుకు బుధవారం మక్తల్ పట్టణానికి వెళ్లాడు. అక్కడి యూనియన్ బ్యాంకులో రూ. 1.15 లక్షలు డ్రా చేశాడు. అందులో లక్ష రూపాయలను బ్యాగులో పెట్టుకున్నాడు. రూ. 15 వేలు జేబులో పెట్టుకున్నాడు. అనంతరం భోజనం చేసేందుకు చౌరస్తాలోని ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న ఎస్ఆర్ఎస్ హోటల్‌కు వెళ్లాడు. షర్టుపై ఏదో పడినట్లు అనిపించడంతో టేబుల్ దగ్గర బ్యాగు ఉంచి, వాష్‌బేసిన్ వద్దకు వెళ్లాడు. అక్కడ షర్టును శుభ్రం చేసుకొని, చేతులు కొడుక్కొని వచ్చి చూసే సరికి బ్యాగులోని డబ్బు మాయం అయ్యింది. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

వైద్యం వికటించి బాలింత మృతి

» ప్రైవేట్ ఆసుపత్రి ముందు బంధువుల ఆందోళన


వనజ (ఫైల్)


కందనూలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి ఓ బాలింత మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొల్లాపూర్ మండలంలోని ముక్కిడిగుండం గ్రామానికి చెందిన గర్భిణి వనజ (26) ఈ నెల 1వ తేదీన కడుపు నొప్పితో జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చింది. వైద్యులు పరీక్షించి ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పి, మందులు రాసి పంపారు. అదే రోజు రాత్రి మళ్లీ కడుపు నొప్పి రావడంతో ఆసుపత్రికి వచ్చారు. వైద్యులు పరీక్షలు చేయించి ఆసుపత్రిలో చేర్చుకున్నారు. మంగళవారం ఆపరేషన్ చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. సాయంత్రం ఆమె అస్వస్థతకు గురికావడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి పంపించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకునేలోగానే వనజ మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గోవర్ధన్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. న్యాయం చేస్తానని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే వనజ మృతి చెందిందని ఆమె తల్లి కాట్రావత్ షావోజీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ, ద్విచక్ర వాహనం ఢీ

» యువకుడి మృతి

కల్వకుర్తి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : లారీ, ద్విచక్రవాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామ సమీపంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ రామ్‌చందర్‌జీ కథనం ప్రకారం.. చారకొండ మండలంలోని జూపల్లికి చెందిన చరణ్‌కుమార్ (22) ద్విచక్రవాహనంపై కల్వకుర్తికి బయలుదేరాడు. మండల పరిధిలోని తాండ్ర సమీపంలో జాతీయ రహదారిపై కల్వకుర్తి నుంచి కోదాడకు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తూ ఢీకొన్నది. ప్రమాదంలో చరణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. జూపల్లిలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న అతడి తల్లి లక్ష్మమ్మ నెల రోజుల క్రితమే గుండెపోటుతో మృతి చెందింది. అతని తండ్రి కూడా మూడేళ్ల క్రితం చనిపోయాడు. సంఘటనపై మృతుడి బంధువు మోహన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరు యూనిట్ల ద్వారా జల విద్యుత్ ఉత్పత్తి


దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఆరు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లు ప్రారంభించి, 2.079 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్ల ద్వారా 2.639 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 20.666 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ తెలిపారు. ఎగువ నుంచి వరద ఇలాగే కొనసాగితే ఉత్పత్తిని వేగంగా కొనసాగించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఆగ్రహ జ్వాల

(5వ పేజీ తరువాయి)

కృష్ణాలో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలాంటిదే. అయితే కొన్నాళ్లుగా శాంతియుతంగానే కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న గ్రామస్థులకు అక్కడి సిబ్బంది కవ్వింపు చర్యలకు పాల్పడటం వల్లే బుధవారం పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు తెలుస్తోంది. ఇందులో నిరసనకారుల్లో మరియమ్మ, కృష్ణ అనే వ్యక్తులకు గాయాలు కాగా కంపెనీ సిబ్బందిలో సుమారు 25 మందికి గాయాలైనట్లు నిర్వాహకులు తెలిపారు.


ఆందోళనలో గాయపడిన మరియమ్మ

కాలుష్యానికి వ్యతిరేకంగానే...

ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే ప్రాంతం తుంగభద్ర నదీ తీరంలో ఉంటుంది. అక్కడ నీటి లభ్యత అధికంగా ఉండటం వల్లే నీటి అవసరం ఎక్కువగా ఉన్న ఈ ఫ్యాక్టరీని అక్కడ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించారు. అయితే కంపెనీ ఏర్పాటయితే భూగర్భజలాలు తగ్గడంతో పాటు కాలుష్యం వల్ల పంటలు పండవని, నీరు కలుషితమవుతుందని, సమీప గ్రామాల ప్రజలకు వాయు కాలుష్యం, నీటి కాలుష్యం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని గ్రామస్థుల్లో భావన ఉన్నది. వాస్తవానికి గత ప్రభుత్వంలోనే కంపెనీ ఏర్పాటుకు అనుమతులు వచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ పనులు ప్రారంభించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సైతం కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వారికి సంఘీభావం తెలిపారు. దీంతో ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలతో పనులను నిలిపివేశారు. ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజాభిప్రాయ సేకరణ చేసిన తర్వాత పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. 2024 నవంబర్‌లో కంపెనీ నిర్మాణం కోసం మరోసారి ఏర్పాట్లు చేయడంతో పెద్ద ధన్వాడ సమీప గ్రామాలైన చిన్న ధన్వాడ, ననసూరు, చిన్నతాండ్రపాడు, నౌరోజీ క్యాంపు, మాన్‌దొడ్డి, తుమ్మిళ్ల, పచ్చర్ల, కిష్టపురం, వేణిసోంపురం తదితర గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. కంపెనీకి వ్యతిరేకంగా మీటింగ్ పెట్టుకొని మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. ఆ సమయంలో మంత్రి ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను కలిసి కూడా విన్నవించారు.

కంపెనీ ఏర్పాటుతో లాభమే

ఇథనాల్ కంపెనీ వల్ల పర్యావరణానికి కానీ, పంటలు, జీవరాశులకు ఎలాంటి నష్టం జరిగే పరిస్థితి లేదు. ఇథనాల్ తయారీలో ఎలాంటి కెమికల్స్ వాడే అవకాశం ఉండదు. ఇది కేవలం బియ్యం, మొక్కజొన్న లాంటి ఆహార పదార్థాల నుంచి తయారు చేస్తారు. కంపెనీ ఏర్పాటు వల్ల 50 మందికి ప్రత్యక్షంగా, 50 మందికి పరోక్షంగా ఉపాధి దొరకుతుంది. స్థానిక గ్రామానికి ఏడాదికి రూ. కోటి అభివృద్ధి పనుల కోసం కేటాయిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో కంపెనీ ఏర్పాటుకు ముందుకు వచ్చాం. అపోహల వల్లే ప్రజలు కంపెనీ పనులను అడ్డుకుంటున్నారు. అవకాశం ఇస్తే అపోహలను తొలగించేందుకు ప్రయత్నం చేస్తాం.

- మంజునాథ్, కంపెనీ డైరెక్టర్

ప్రజాభిప్రాయ సేకరణ లేకపోవడమే...

ఏదైనా కంపెనీ ఏర్పాటు చేసేటపుడు దాని ఆవశ్యకత, పర్యవసానాలు, లాభాలు, నష్టాలపై సమీప గ్రామాల ప్రజల నుంచి అధికారులు, కంపెనీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయాల్సి ఉంటుంది. కానీ పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో ఈ ప్రక్రియ జరగలేదు. ఎన్నిసార్లు నిరసన తెలుపుతున్నప్పటికీ మళ్లీమళ్లీ ఏర్పాట్లు చేసుకుంటుండం సమీప గ్రామాల ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. సోమవారం రాత్రి జేసీబీ, హిటాచీలు, కంటెయినర్లను కంపెనీ పెద్దధన్వాడకు తరలించింది. రాత్రికి రాత్రే గుడారాలు కూడా వేశారు. ఆ సమయంలో గ్రామస్థుల్లో కొంతమంది పెద్దలు వెళ్లి అడగడంతో సిబ్బంది కొంత దూకుడుగా కవ్వింపు చర్యలకు పాల్పడట్లు తెలుస్తోంది. దీంతో ఆ పెద్దలు.. గ్రామాలకు వెళ్లి జరిగిన విషయాన్ని ప్రజలకు తెలియజేశారు. బుధవారం శాంతియుతంగా నిరసన తెలుపుదామని ప్రయత్నిస్తే ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు పెద్ద ధన్వాడ, చిన్నధన్వాడ, మాన్‌దొడ్డిలో పికెట్ ఏర్పాటు చేశారు. దీంతో మరింత ఆగ్రహం చెందిన ప్రజలు పొలాల నుంచి వెళ్లి కంపెనీకి చెందిన కంటెయినర్, బొలేరోను బోల్తా చేసి, కంటెయినర్, గుడారానికి నిప్పు పెట్టారు. హిటాచీ, బొలేరో అద్దాలను ధ్వంసం చేశారు. ఇందులో గ్రామస్థులతో పాటు కంపెనీ సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేసి.. నిరసనకారులను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కంపెనీ సిబ్బంది అక్కడి నుంచి పారిపోగా పికెట్ పెట్టి పోలీసులు వీడియో ఫుటేజీ ఆధారంగా 25 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకొని రాజోలి, శాంతినగర్, మానవపాడు, అయిజ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయితే కంపెనీ మాత్రం ఇది ఎకో ఫ్రెండ్లీ అని, ప్రజాభిప్రాయ సేకరణ అవసరం ఉండదని నిబంధనల్లో ఉన్నదని చెబుతోంది. కంపెనీ ఏర్పాటు వల్ల లాభాలే తప్పా నష్టాలు ఉండవని పేర్కొంటోంది.

క్రీడల హబ్‌గా తెలంగాణ

(5వ పేజీ తరువాయి)

ఆవిష్కరించి, మహబూబ్‌నగర్-మేడ్చల్ మాల్కాజ్‌గిరి జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీశ్వర్‌రెడ్డి, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్, నసూరుల్లా హైదర్ మహ్మద్, బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబహాన్‌జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్‌ఖలేద్‌అలీ, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ ఇలియాజ్, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు విశాల్, హన్మంతరావు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ శుభారంభం

జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ స్టేడియంలో 1వ తెలంగాణ అంతర్ జిల్లాల అండర్-23 3X3 మహిళ, పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నీ బుధవారం హోరాహోరీగా మొదలైంది. పురుషుల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు కరీంనగర్‌పై 11-01, ఖమ్మంపై 13-12, మెదక్‌పై 16-10 తేడాతో గెలుపొందింది. మహిళల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు ఖమ్మంపై 11-08, కరీంనగర్‌పై 11-1తో గెలిచింది.


తలబడుతున్న మహబూబ్‌నగర్-మేడ్చల్ మల్కాజ్‌గిరి మహిళా జట్లు

పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు భూపాలపల్లిపై 21-10, రంగారెడ్డి మెదక్‌పై 22-06, హైదరాబాద్ మేడ్చల్‌పై 18-11, హన్మకొండ మహబూబాబాద్‌పై 16-14, హైదరాబాద్ నిజామాబాద్‌పై 21-12 తేడాతో గెలుపొందగా, ఖమ్మం జట్టు గద్వాలపై 16-08, మేడ్చల్ నిజామాబాద్‌పై 21-08, నల్గొండ జగిత్యాలపై 18-08, హన్మకొండ కామారెడ్డిపై 17-09 తేడాతో విజయం సాధించాయి. మహిళ విభాగంలో ఖమ్మం జట్టు కరీంనగర్‌పై 15-02, హైదరాబాద్ జయశంకర్ భూపలపల్లిపై 2-00, హైదరాబాద్ జట్టు నిజామాబాద్‌పై 21-08 తేడాతో గెలిచాయి. గురువారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు.

ఫార్మసీ ఆఫీసర్ల సంబురాలు


డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మీతో కలిసి కేక్‌ను కట్ చేసి సంబురాలు నిర్వహించుకుంటున్న వైద్య సిబ్బంది

కందనూలు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా గుర్తిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సిబ్బంది బుధవారం సంబురాలు నిర్వహించుకున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మికి గెజిట్ కాపీలను అందించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మాసిస్టులను ఫార్మసీ అధికారులుగా గుర్తిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం ఆనందదాయకమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల తర్వాత అంతటి ప్రాధాన్యం ఉన్న పోస్టు ఫార్మసీ ఆఫీసర్లు అని తెలిపారు. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మసీ అధికారుల కొరత ఉన్నా, రోగులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటదాస్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్‌నాయక్, ప్రొగ్రామ్ అధికారి డాక్టర్ లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్, సభ్యులు శరత్‌బాబు, యాదయ్య, అశోక్, జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేశ్, సభ్యులు శ్రీనివాసులు, జీకే వెంకటేశ్, బాలరాజు, కుమార్, భగత్‌సింగ్, అనిత, రజిని, రఘు, అనురాధ, మాధవి పాల్గొన్నారు.

పాలమూరు ఆత్మ పీఆర్‌ఎల్‌ఐ

» జిల్లాపై నల్గొండ నాయకుల కుట్ర

» పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రాఘవాచారి

పాలమూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల ఆత్మలాంటిదని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి అన్నారు. నల్గొండ నాయకులందరూ కలిసి పాలమూరు జిల్లాకు దక్కాల్సిన నీటిని తమ జిల్లాకు తీసుకుపోయేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు ప్రజలకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని ప్రశ్నించారు. నాడు వైఎస్ జగన్, నేడు చంద్రబాబులు ఆంధ్రప్రదేశ్‌కు నీరు ఎక్కువ ఎలా తీసుకెళ్లాలో ఆలోచిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఇక్కడికి వచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్గొండ జిల్లాకు నీటిని తీసుకెళ్లే పనులనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. పాలమూరు ప్రజల మొదటి ముద్దనే లాక్కునేందుకు అందరూ పోటీ పడుతున్నారని విమర్శించారు. ఇది అన్యాయమని చెప్పటానికి ఇక్కడి పాలకులకు ధైర్యం సరిపోవడం లేదన్నారు. పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తే ముఖ్యమంత్రి అయినా, ఇక్కడి ప్రజలకే అన్యాయం చేయటం ఏమిటన్నారు. కాలుష్య కారక కంపెనీలు ఏర్పాటు చేయొద్దని వద్దని ఆందోళన చేసిన ప్రజలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు ఏ.తిమ్మప్ప, శ్రీదేవి, ఎస్ఎం ఖలీల్, పి.విజయ్‌కుమార్, జలాల్‌పాషా పాల్గొన్నారు.

దినసరి కూలీల జీవితం దుర్భరం

- ఎస్టీ వసతి గృహాల్లో 25 ఏళ్ల నుంచి పని
- కుక్, కామాటి, హెల్పర్, వాచ్‌మెన్ విధులు
- వేతనాలు రూ.13,500 నుంచి 11,500కు తగ్గింపు



తమకు జీతాలు పెంచేలా చూడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దినసరి కూలీలు (ఫైల్)

కల్వకుర్తి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పని చేస్తున్న దినసరి కూలీల జీవితం దుర్భరంగా మారింది. సాధారణంగా ఎవరికైనా కాలం గడిచే కొద్దీ, అనుభవం పెరిగే కొద్దీ కూలి రేట్లు పెరుగుతాయి. కానీ ఎస్టీ వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి కూలీల జీతాలు మాత్రం తగ్గిపోయాయి. గతంలో ఉన్న రూ.13,500 వేతనాలు ఇప్పుడు రూ.11500కు చేరాయి. దీంతో ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు, ఎస్టీ హాస్టళ్లు, ఎస్టీ కళాశాలల్లో పని చేస్తున్న దినసరి కూలీలకు (కుక్, కామాటి, హెల్పర్, వాచ్‌మెన్) కుటుంబ పోషణ భారమైంది. ప్రభుత్వం స్పందించి తమ జీతాలను పెంచి న్యాయం చేస్తుందన్న ఆశతో సంవత్సరాల తరబడి ఎదురుచూస్తూ ఉన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో..

నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో మొత్తం 28 ఎస్టీ వసతి గృహాలున్నాయి. అందులో 15 ఆశ్రమ పాఠశాలలు, 9 వసతి గృహాలు, నాలుగు ఎస్టీ కళాశాల వసతి గృహాలు ఉన్నాయి. వాటిల్లో మొత్తం 128 మంది దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. వసతి గృహాల్లో 25 సంవత్సరాలుగా పని చేస్తున్న వీరికి మొదట్లో రూ.3,500 వేతనం ఇచ్చేవారు. అప్పటి ప్రభుత్వాలు ఆ వేతనాన్ని ఒకసారి రూ. 7 వేలు, మరోసారి 9 వేలు, ఇంకోసారి 11 వేలకు పెంచింది. గత ప్రభుత్వం ఒకే సారి రూ.13500 పెంచింది. కానీ తాజాగా వారి వేతనాన్ని రూ. 11,500కు తగ్గించింది. దీనికి తోడు కూలీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవు.

పూట గడవడం కష్టం

అరకొర వేతనాలతో దినసరి కూలీల కుటుంబాలకు పూట గడవడమే కష్టంగా మారింది. నిత్యావసర సరుకుల కొనుగోలు, పిల్లల చదువులు, ఆసుపత్రుల ఖర్చులు భరించలేకపోతున్నారు. దీంతో వేతనం సరిపోక అప్పులు చేయాల్సి వస్తోంది. ఇచ్చే వేతనం కూడా ఐదారు నెలల కోసం ఇస్తుండటం మరింత సమస్యగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలని వారు కోరుతున్నారు. తమకు జీతాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల వారు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో 25 సంవత్సరాలుగా పని చేస్తున్నాను. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలి. ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరిస్తారని, న్యాయం చేస్తారని ఎదురు చూస్తున్నాం.

\- మబ్బు నర్సమ్మ, కామాటి, కల్వకుర్తి

ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే..

రాష్ట్ర వ్యాప్తంగా దినసరి కూలీలకు ప్రభుత్వం నెలకు రూ. 11,500 రూపాయల చొప్పున వేతనం చెల్లిస్తోంది. అందుకు అనుగుణంగా జిల్లాలోని ఎస్టీ వసతి గృహాల్లో పని చేస్తున్న దినసరి కూలీలకు వేతనాలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశం మేరకు చర్యలు తీసుకుంటాం.

\- యాదమ్మ, ఏటీడీవో

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- జడ్చర్లలో బాలుడు, వెంకటాయపల్లిలో యువకుడి బలి

జడ్చర్ల/దేవరకద్ర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు.



శ్రేయన్స్ (ఫైల్)

జడ్చర్ల పట్టణంలోని సరస్వతీనగర్ కాలనీలో బుక్క రాఘమేందర్ కుమారుడు శ్రేయన్స్ (10) ఇంటి నుంచి కిరాణ దుకాణానికి సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంతో సైకిల్ అదుపు తప్పి కింద పడి విద్యుత్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరుకు తగిలిలాడు. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలానికి ఎస్ఐ మల్లేష్ చేరుకొని విచారణ చేపట్టారు. ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వారి నిర్లక్ష్యం ఓ ప్రాణాన్ని తీసిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డిలు తీవ్ర విచారం వ్యక్తంచేశారు.



శివ (ఫైల్)

దేవరకద్ర మండల పరిధిలోని వెంకటాయపల్లి గ్రామానికి చెందిన యువకుడు శివ (22) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శివ గ్రామంలోని ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం ఉదయం గ్రామంలో విద్యుత్ నిలిచిపోయింది. దీంతో గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఎల్‌సీ తీసుకోకుండా పనిచేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతునికి తల్లి, చెల్లెలు ఉన్నారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత



అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంతో పోలీసులు, అధికారులు

నర్వ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, నర్వ మండలం పెద్దకడుమూర్‌లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ కుర్మయ్య తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన ఎరుకలి నరసింహ ఇంట్లో పోలీసులు తనిఖీ చేశారు. దాదాపు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు గుర్తించారు. డిప్యూటీ తహసీల్దార్ పంచనామా నిర్వహించి, బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేశారు. లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించినా, రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ముగ్గురు మహిళల అదృశ్యం

ఆత్మకూరు/ బాలానగర్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ముగ్గురు మహిళలు అదృశ్యం అయ్యారు. ఆత్మకూరు ఎస్ఐ నరేందర్, బాలానగర్ ఎస్ఐ లెనిన్, ఊర్కొండ ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, ఆత్మకూరుకు చెందిన రాసాని రాజేశ్వరి పట్టణంలో జరిగిన గ్రామ దేవతల విగ్రహాలు, బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలకు ఈ నెల 1వ తేదీన మహబూబ్‌నగర్ మండలం బోయిలాయిపల్లి గ్రామానికి చెందిన కురువతమ్మను పిలిపించుకున్నది. మరుసటి రోజు ఉదయం ఆమె నిద్ర లేచే సరికి కురువతమ్మ కనిపించలేదు. చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆత్మకూరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. అదృశ్యమైన సమయంలో కురువతమ్మ గోధుమ రంగు కాటన్‌చీర, ముదురు ఎరుపు రంగు జాకెట్ ధరించి ఉందని ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

\- మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని కేతిరెడ్డిపల్లిలో మరో మహిళ అదృశ్యం అయ్యింది. కోయిలకొండ మండల కేంద్రానికి చెందిన బిజినపల్లి కృష్ణయ్య అనే వ్యక్తి కేతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో పని చేస్తూ, కుటుంబం సహా అక్కడే నివసిస్తున్నాడు. ఆమె తల్లి వెంకటమ్మ (60) గత నెల 17న కనిపించకుండా పోయింది. దీంతో అతడు చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

\- నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం, జగబోయన్‌పల్లి గ్రామానికి చెందిన ముక్తాల నారమ్మ మంగళవారం అదృశ్యమైంది. ఆమె రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వెల్జాల్‌లో సంతకు వెళ్లి వస్తానని భర్తకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం అయినా ఆమె తిరిగి రాకపోవడంతో భర్త రాములు ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. తన భార్య సంతకు వెళ్లి తిరిగి రాలేదని, మీ వద్దకు వచ్చిందా అని అడిగాడు. వారు రాలేదని చెప్పడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు.

మునిసిపల్ ఉద్యోగిపై దాడికి యత్నం

- జీతాల్లో కోతలెందుకని ప్రశ్నించడంతో ఆగ్రహం
- సీనియర్ అసిస్టెంట్‌పై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

గద్వాల క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జీతాల్లో కోతలు ఎందుకని ప్రశ్నించిన మునిసిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌పై సీనియర్ అసిస్టెంట్ దాడికి యత్నించాడు. దీంతో ఆయన సహోద్యోగులతో కలిసి బుధవారం అదనపు కలెక్టర్ నర్సింగరావుకు ఫిర్యాదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మన్సూర్ అహ్మద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల మునిసిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. గట్టన్న అనే జవాన్‌కు గత నెల జీతం రూ. 14,853 రావాల్సి ఉండగా, అందులో కోత విధించి, రూ. 13,461 వచ్చేలా చేశాడని చెప్పారు. ప్రశాంత్ అనే జవాన్‌కు గత నెల జీతం రాకుండా చేశాడని ఆరోపించారు. అంతకు ముందు నెల మాత్రం ప్రశాంత్ వద్ద రూ. 5 వేలు తీసుకొని జీతం వచ్చేలా చేశాడని తెలిపారు. తాను కంటి ఆపరేషన్ కోసం గత నెలలో 13 రోజులు సెలవు తీసుకున్నానని, అందుకు సంబంధించిన ఎర్న్‌డ్ లీవ్ డబ్బులు అడుగగా, ఎస్టీవో కార్యాలయంలో ఇవ్వాలని చెప్పి రూ. 13 వేలు తీసుకున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై అడిగేందుకు వెళ్లిన తనపై సీనియర్ అసిస్టెంట్ కుర్చీతో దాడికి యత్నించాడని తెలిపారు. ఆయనకు కంప్యూటర్ ఆపరేటర్ అజయ్ సహకరిస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందుకు ఆయన స్పందిస్తూ సంఘటనపై విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నాపై తప్పుడు ఆరోపణలు

దాడికి యత్నం ఘటనపై 'ఆంధ్రజ్యోతి' సీనియర్ అసిస్టెంట్ అశోక్‌ను వివరణ కోరగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ప్రశాంత్ అనే ఉద్యోగిని ఆయన సొంతంగా తీసుకున్నాడని చెప్పారు. ఈ విషయంపై కమిషనర్‌తో చర్చించి, ఆయన ఆదేశం మేరకు జీతాలు చెల్లిస్తామని చెప్పగా, తనను దుర్భాషలాడారన్నారు. ఈ ఘటనలో తన ప్రమేయం లేదని కంప్యూటర్ ఆపరేటర్ అజయ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

- పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రతిష్ఠాపనకు సిద్ధం చేసిన అమ్మ వారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు



అమ్మ వార్ల విశిష్టతను వివరిస్తున్న వేద పండితులు

ఆత్మకూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, కర్రెమ్మ, లింగమయ్య కోట మైసమ్మ, కట్ట మైసమ్మ, భూ లక్ష్మమ్మ, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన మహోత్సవం రెండవ రోజు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకు ముందు పోచమ్మ ఆలయ ప్రాంగణంలో పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మొగిలి శ్రీధర్‌గౌడ్, గంగాధర్ గౌడ్, గాడి కృష్ణమూర్తి, గాడి లక్ష్మీనారాయణ, నల్గొండ శ్రీనివాసులు, రవికుమార్, ఎస్టీడీ శ్రీనివాసులు, ఆనంద్, మణివర్ధన్‌రెడ్డి, శివానంద్, రమాకాంత్, నాగేశ్, వెంకటేశ్, యాదగిరి శెట్టి, బాలకృష్ణ, రఘు, సూరి, అశోక్, కృష్ణయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

- నారాయణపేట సీఐ శివశంకర్
- కానుకుర్తిలో 'కమ్యూనిటీ కాంటాక్ట్'



కానుకుర్తిలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శివశంకర్

దామరగిద్ద, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నేరాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నారాయణపేట సీఐ శివ శంకర్ అన్నారు. నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, కానుకుర్తి గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 30 మంది పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. కొంత మంది వ్యక్తిగత వివరాలు సేకరించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు ఉన్నారా అని ఆరా తీశారు. సరైన ధ్రువపత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ప్రజలు, మహిళలు ఆపద సమయంలో 100కు ఫోన్ చేయాలన్నారు. స్వీయ రక్షణ కోసం గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు పి.రాజు, రాములు, మహేశ్వరి, ఆర్ఎస్ఐలు శివశంకర్, మద్దయ్య పాల్గొన్నారు.

చేనేత కళకు ప్రోత్సాహం

- డబ్ల్యూఈ హబ్ సీఈవో
- కలెక్టర్‌ను కలిసిన మహిళా పారిశ్రామికవేత్తలు



కలెక్టర్‌ను కలిసిన మహిళా పారిశ్రామికవేత్తలు

గద్వాల న్యూటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను ప్రోత్సహించడానికి మహిళా పారిశ్రామిక వేత్తలు ముందుంటారని డబ్ల్యూఈ హబ్ (ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్) సీఈవో పల్లచోళ్ల సీత, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. వీ హబ్ ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలతో కలిసి వారు బుధవారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ జోగుళాంబ గద్వాల చేనేతను పోత్సహించేందుకు, మహిళా కార్మికుల సామర్థ్యాభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక, డిజిటల్ సాక్షరత, మార్కెట్ లింకేజీ, వ్యవస్థాగత సమన్వయంతో ఉజ్వలమైన జీవనోపాధి అవకాశాలను కల్పించేందుకు వీ హబ్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ 'సూత్రిక' ద్వారా దోహదపడుతుందన్నారు. అనంతరం వీ హబ్ ప్రాజెక్టు లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్‌తో చర్చించారు. ప్రాజెక్టు విజవంతంగా అమలు కావడానికి సంబంధిత శాఖల అధికారులు సహకరించేలా చూడాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో వీ హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ తదితరులు పాల్గొన్నారు.

పులికల్ కొనుగోలు కేంద్రానికి రాయలసీమ ధాన్యం

- కొనుగోలును నిలిపిన అధికారులు

అయిజ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అయిజ మండల పరిధిలోని పులికల్ గ్రా మంలో కొనసాగుతున్న వడ్ల కొనుగోలు కేంద్రానికి రాయలసీమ నుంచి ధాన్యం వచ్చింది. బుధవారం రాయలసీమ ప్రాంతం అయిన నాగల్‌దిన్నె గ్రామం నుంచి 2 ట్రాక్టర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. ఈ సమాచారం తెలుసుకున్న పులికల్ ఏఈవో శివకుమార్ వీటి కొనుగోళ్లను నిలిపివేసినట్లు తెలిపారు.

నోటీసులిస్తే భయపడేది లేదు

- స్పష్టం చేసిన రైతులు



రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసులపై సమావేశమైన రైతులు

బల్మూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం కోసం నోటీసులు ఇస్తే భయపడేది లేదని రైతులు తెగేసి చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి మీరే కారణమంటే, కాదే మీరేనంటూ ఇరు పార్టీల నాయకుల మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది. చివరకు భూములు కోల్పోవడానికి సిద్ధంగా లేమని అంగీకరించి ఒక తాటిపైకి వచ్చారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు రైతులకు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. రైతులను మోసం చేసే ప్రభుత్వాలు ఎప్పటికీ ముందుకు సాగవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు డిమాండ్ చేశారు.

అండర్-19 క్రికెట్ టోర్నీలో.. మహబూబ్‌నగర్ దూకుడు

- 170 పరుగుల తేడాతో గద్వాలపై ఘన విజయం
- డబుల్ సెంచరీతో చెలరేగిన అబ్దుల్ రాఫె



విజేత మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అండర్-19 ఉమ్మడి జిల్లా వన్‌డే క్రికెట్‌లో మహబూబ్‌నగర్ జట్టు వరుస విజయాలతో దూసుకుపోతోంది. గద్వాల జట్టుపై 170 పరుగుల తేడాతో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన మూడో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ - గద్వాల జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 360 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫె 173 బంతుల్లో 31 ఫోర్లు, 6 ఫోర్లతో డబుల్ సెంచరీ (243) చేసి నాటౌట్‌గా నిలిచాడు. కార్తిక్ 98 బంతుల్లో 8 ఫోర్లతో అర్ధసెంచరీ (62), సోను 23, అంకిత్‌రాయ్ 12 పరుగులు చేశారు. గద్వాల బౌలర్లలో భరత్ 2, అర్హన్ ఒక వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గద్వాల జట్టు 48.1 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో గోపీచంద్ 34, తల్హా 37, అర్హన్ 19, కార్తికేయ 19 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లలో యువన్ 3, కార్తిక్, అభినవ్ చెరో రెండు వికెట్లు తీశారు. వరుస విజయాలతో దూసుకెళ్తున్న జట్టును, డబుల్ సెంచరీ సాధించిన అబ్దుల్ రాఫెను క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారులు ముబ్షర్, శ్రీను, రంజిత్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక



ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, ఎల్.రవికుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్ల ఎంపికకు బుధవారం పోటీలు నిర్వహించారు. అండర్-13, 15, 17, 19 బాల, బాలికల సీనియర్, వెటరన్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలు మహబూబ్‌నగర్ స్టేడియంలో బుధవారం కొనసాగాయి. కార్యక్రమానికి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా తుది జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ ఎల్. రవికుమార్, జాయింట్ సెక్రటరీలు సాదత్‌ఖాన్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు నవాబ్‌పేటకు భట్టి రాక

నవాబ్‌పేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం నవాబ్‌పేటకు రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీరటి రాంచంద్రయ్య, మార్కెట్ ఛైర్మన్ హరలింగం, నాయకులు భూపాల్‌రెడ్డి, హమీద్, సత్యనారాయణ గౌడ్ బుధవారం తెలిపారు. రుద్రారం, కొండాపూర్ గ్రామాల్లో సబ్‌స్టేషన్లతో పాటు నవాబ్‌పేటలో 132 కేవీ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

ప్రారంభమైన ఫార్మ్-డీ పరీక్షలు

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో అనుబంధంగా ఉన్న ఫార్మసీ విద్యార్థులకు ఫార్మ్-డీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఫార్మ్-డీ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ కె.ప్రవీణ పరిశీలించారు. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ఆర్‌సీబీ గెలుపుతో యువత సంబురాలు

బాలానగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌సీబీ గెలుపుతో క్రికెట్ అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పెద్దాయపల్లి చౌరస్తా నుంచి ప్రధాన చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, కేక్ కట్ చేశారు.

అందుబాటులో మొక్కలు

మిడ్జిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సీజన్‌కు సరిపడా మొక్కలు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో గీతాంజలి అన్నారు. బుధవారం మండలంలోని రాణిపేట నర్సరీని పరిశీలించి, మొక్కలను నీరు పోసే విధానం తదితర విషయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

మోస్తరు వర్షం

నవాబ్‌పేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మోస్తరు వర్షం కురిసింది. దీంతో మరోసారి మెట్ట పొలాల్లో విత్తనాలు విత్తుకునేందుకు రైతులకు మంచి అదును ఏర్పడింది.

పేదల ప్రభుత్వం కాంగ్రెస్

మిడ్జిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గడ్డల విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వాడియాల గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి అంజనేయులు, మాజీ సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, నాయకులు మల్లయ్య, నసీర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బాలానగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని బాలానగర్ ఎస్‌ఐ లెనిన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయని, సాంకేతికతను ఆసరాగా చేసుకొని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ, వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధరలు

దేవరకద్ర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉల్లి సీజన్ తగ్గడంతో ఉల్లి ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయి. బుధవారం దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లికి బహిరంగ వేలంలో గరిష్ఠంగా క్వింటాలుకు రూ.2000, కనిష్ఠంగా రూ.1000 పలికింది. ఉల్లి సీజన్‌లో మూడు నెలలుగా ఉల్లి క్వింటాలుకు రూ.1600 పలుకగా సీజన్ ముగియడంతో స్వల్పంగా ధరలు పెరుగుతూ వస్తోంది. కాగా మార్కెట్‌కు 30 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. కాగా గత రెండు వారాలతో పోల్చితే ఈ వారం క్వింటాలుకు రూ.400 పెరిగింది.

వార్డుల ముసాయిదా జాబితా విడుదల

దేవరకద్ర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పడిన దేవరకద్ర మునిసిపాలిటీని 12 వార్డులుగా విభజించిన జాబితా లిస్టును బుధవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంతో పాటు ఆయా గ్రామాల వార్డుల్లో జాబితా లిస్టును పెట్టినట్లు మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఈవో సీత్యానాయక్ తెలిపారు. దేవరకద్ర గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో 14 వార్డులు ఉండగా, దేవరకద్ర పట్టణానికి మరో నాలుగు గ్రామాలు చౌదర్‌పల్లి, బల్సుపల్లి, పెద్దగోప్లాపూర్, మిన్గోనిపల్లిని విలీనం చేస్తూ 12 వార్డులుగా విభజించినట్లు తెలిపారు. ఒక వార్డులో 850 చొప్పున మొత్తం 10,154 ఓటర్ల జాబితాను రూపొందించినట్లు తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

జడ్చర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ డీకే అరుణ సహకారంలో మహిళా దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అలింకో ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారు సంయుక్తంగా బుధవారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన దివ్యాంగుల, వయోవృద్ధుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్, చంకకర్రలు, వీల్ ఛైర్లు, బధిరులకు వినికిడి యంత్రాలు, అంధులకు చేతి కర్రలు, బుద్ధిమాంద్యులకు టీఎల్‌ఎమ్ కిట్స్ అందించేందుకు దరఖాస్తులు స్వీకరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సాహితి రెడ్డి, బాలవర్ధన్‌గౌడ్, అమర్నాథ్‌గౌడ్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సరిహద్దు మాటున.. ఇసుక దందా

» ఉదండాపూర్ రిజర్వాయర్‌లో కృత్రిమ ఇసుక తయారీ



విక్రయానికి సిద్ధంగా ఉన్న కృత్రిమ ఇసుక

నవాబ్‌పేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఏంది సారు ఇట్లావచ్చినవ్.. ఇది నీ బార్డర్ కాదు.. మీకు సంబంధమే లేదు. ఇది జడ్చర్ల పరిధికి వస్తోంది.. వెళ్లండి ఏమైనా ఉంటే మీ మండలంలో చూసుకో.. జడ్చర్ల పోలీసులు వచ్చినప్పుడు సార్ మీరు మమల్ని బెదిరిస్తే బెదరం నీ ఇష్టముంటే కేసు చేసుకో.. మాది నవాబ్‌పేట మండలం పరిధికి వస్తుంది. ఇది పోలీస్ అధికారులకు ఎదురయ్యే సమస్య. జడ్చర్ల, నవాబ్‌పేట మండలాల సరిహద్దు మాటున ఉన్న ఉదండాపూర్ రిజర్వాయర్ ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. దీంతో ఇసుక వ్యాపారులు రాత్రీ పగలు తేడా లేకుండా ఇసుక తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్, ఒల్లూర్, ఖానాపూర్, నవాబ్‌పేట మండలంలోని కారుకొండ, సిద్దోటం, తీగలపల్లి గ్రామాల మధ్య ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ రిజర్వాయర్‌లో వివిధ గ్రామాలకు చెందిన ఇసుక వ్యాపారులు రిజర్వాయర్ గుంతల్లో నీరు ఉండటంతో టిప్పర్ల ద్వారా మట్టి తీసుకొచ్చి ఇక్కడ కృత్రిమ ఇసుక తయారు చేసి జడ్చర్ల, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో జడ్చర్ల పోలీసులు వస్తే ఇది మీ పరిధి కాదు నవాబ్ పేటకు వస్తోందని చెప్పి వారిని తిప్పి పంపుతున్నారని, నవాబ్‌పేట పోలీసులు వస్తే జడ్చర్ల పోలీసుల పరిధి అంటూ దాట వేస్తున్నట్లు సమాచారం. దీంతో రెండు మండలాల పోలీసులు సరిహద్దు ప్రాంతం కావడంతో మనకెందుకులే అన్నట్లు వెనక్కి తగ్గడంతో ఇసుక వ్యాపారులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

ఇక నవాబ్‌పేట మండలంలో ప్రధానంగా ఉన్న దుందుభీ వాగు మండలంలోని గురుకుంట సమీపంలో ఉన్న సోమసముద్రం నుంచి మొదలై అమ్మాపూర్, లోకిరేవు, చౌటపల్లి, ఇప్పటూర్, కారూర్ వరకు పది కిలో మీటర్లు మండలంలో పారుతుంది. ఇక వర్షాకాలంలో పెద్ద ఎత్తున వాగు పొంగి పొర్లుతుంది. దీంతో భారీగా ఇసుక వాగు పరిసర ప్రాంతాల్లో వచ్చి చేరడంతో ఇసుక అక్రమార్కులు ఫిల్టర్ చేసి హైదరాబాద్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, నవాబ్‌పేట ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

చర్యలు తప్పవు

ఇసుక తరలింపు నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రాత్రివేళ గస్తీ నిర్వహించి ట్రాక్టర్లు, టిప్పర్లను సీజ్ చేస్తున్నాం. ఇసుక తరలింపు సమాచారం ఉంటే ప్రజలు నిర్భయంగా తమకు ఫిర్యాదు చేయవచ్చు.

విక్రం ఎస్‌ఐ, నవాబ్‌పేట

చెక్‌డ్యాంలు ధ్వంసం..

2009లో డాక్టర్ మల్లురవి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వాగుపై చెక్‌డ్యాంలు నిర్మించారు. అప్పటి నుంచి వాగు పరిసర ప్రాంత రైతులకు ఈ చెక్‌డ్యాంలు వరంగా మారాయి. కానీ కొంతకాలంగా అక్రమార్కులు ఇసుకను ఫిల్టర్ చేయడంతో చెక్‌డ్యాంలు కూలిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ దుందుభీ వాగు సైతం నవాబ్‌పేట, రాజాపూర్ మండలాల సరిహద్దు ప్రాంతం కావడంతో పోలీసులకు సమస్యగా మారింది.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

» ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : భూములకు సంబంధించిన సమస్యలను సత్వర పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కర్వెన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకోరావడం జరిగిందన్నారు. రైతులను నమ్మించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో అక్కడి రైతులకు ఎకరాకు రూ.13 లక్షలు చెల్లిస్తే.. అదే పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.3.5 లక్షలు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇటీవల అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, తహసీల్దార్ కిషన్‌నాయక్, మాజీ సర్పంచ్ హర్యానాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, భూపతిరెడ్డి, బాలేమియా పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



అగ్రహారంపొట్లపల్లిలో రైతు నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారులు

గండీడ్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని బల్సూర్‌గొండ, గోవిందుపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, బల్సూర్‌గొండ రెవెన్యూ సదస్సును తనిఖీ చేసి, వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు.బల్సూర్‌గొండలో ఒకటి, గోవిందుపల్లిలో 13 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మల్లికార్జున్‌రావు తెలిపారు. డీటీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

● దేవరకద్ర : మండలంలోని హజీలాపూర్, కోయిల్‌సాగర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 182 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. డీటీ దీపిక, ఆర్‌ఐ శరత్ కుమార్, సిబ్బంది నరేష్‌కుమార్, రామకృష్ణారెడ్డి, భక్తరాజు, నరసింహ, రమేష్, సత్తి పాల్గొన్నారు.

● రాజాపూర్ : మండలంలోని అగ్రహారం పొట్లపల్లి, గుండ్లపొట్లపల్లి గ్రామాల్లో తహసీల్దార్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, రెండు గ్రామాల్లో 26 దరఖాస్తులు వచ్చాయి. ఎంపీవో వెంకట్‌రాములు, డీటీ భారతి, డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

● మూసాపేట : అడ్డాకుల మండలం కందూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 81 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శేఖర్ తెలిపారు. డీటీ ఖలీద్ బీన్ ఏక్బాల్, గిర్దావర్లు శశివర్ధన్, సృజన్‌కుమార్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీహరి పాల్గొన్నారు.

● బాలానగర్ : మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏమైన సమస్యలు ఉంటే సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. బాలానగర్ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అశ్విని, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నరసింహ, రమేష్, మహేష్, సతీష్, శ్రీకాంత్, చంటి పాల్గొన్నారు.

● నవాబ్‌పేట : మండలంలోని ఇప్పటూర్, కారూర్ గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ సువర్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

జడ్చర్ల జట్టుకు మూడో విజయం



విజయం సాధించిన జడ్చర్ల జట్టు

జడ్చర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్చర్ల మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్- 19 ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల్లో జడ్చర్ల జట్టు వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసుకుంది. బుధవారం జడ్చర్ల, నాగర్‌కర్నూల్ జట్లకు మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన జడ్చర్ల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 281 పరుగులు చేసి (49.1 ఓవర్లలో) ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు 215 పరుగులకు (43.4 ఓవర్లకు) ఆలౌట్ అయ్యింది. దీంతో జడ్చర్ల జట్టు నాగర్‌కర్నూల్ జట్టుపై 66 పరుగుల తేడాతో విజయం సాధించింది.

మార్కెట్‌కు వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలి

జడ్చర్ల జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ కమిటీకి వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డును బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు ఎడ్ల బాలకృష్ణగౌడ్ సందర్శించారు. రైతులు తెచ్చిన పంటలను కొనుగోలు చేయకపోతే బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధికార ప్రతినిధి నవీన్, పట్టణ అధ్యక్షుడు అమర్నాథ్‌గౌడ్, రూరల్ అధ్యక్షుడు రామకృష్ణ, శివశంకర్‌రెడ్డి, నరేష్, మల్లేష్ పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

- శ్రేయాన్స్ మరణం కలిచి వేసింది

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ అధికారుల కారణంగా ప్రజల నిండు ప్రాణాలు పోతే సహించేది లేదని, అందుకు కారుకులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు. జడ్చర్ల పట్టణంలోని 3వ వార్డులో బుధవారం విద్యుదాఘాతంతో శ్రేయాన్స్ అనే పదేళ్ల బాలుడు మృతి చెందడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజవర్గ పరిధిలో వివిధ ప్రాంతాల్లో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని, వాటిని నుంచి ప్రజలకు ఆపద వాటిల్లకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులపై ఉందన్నారు. ప్రత్యేకించి వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండటంతో అధికారులు అన్ని ప్రాంతాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. శ్రేయాన్స్ తండ్రి కాంగ్రెస్ నాయకుడు బుక్క రాఘవేందర్‌ను ఫోన్‌లో పరామర్శించారు. ఎమ్మెల్యే తల్లి శశికళారెడ్డి శ్రేయన్స్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్


» నాయినోనిపల్లిలో వరుస ఘటనలు



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

హన్వాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారు. తొమ్మిది నెలల్లో ఒకే గ్రామంలో మూడు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. తాజాగా మే 9న నాయినోనిపల్లి గ్రామానికి శంకరి కృష్ణయ్య కూతురి వివాహం కోస్గిలో జరిగింది. ఈ క్రమంలో కృష్ణయ్య కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లారు. అదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే తాళం విరగగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారం, నగదు దోచుకెళ్లారు. గత సంవత్సరం డిసెంబరు నెలలో కూడా పెళ్లి జరిగిన రోజే ఎర్ర శ్రీనువాసులు ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డాడు. అదే సంవత్సరం గ్రామంలో మరో ఇంట్లో బంగారం దోచుకెళ్లారు. ఇదిలా ఉంటే వ్యవసాయ బావుల వద్ద కూడా మోటారుతో పాటు గడ్డి కత్తిరించే యంత్రానికి ఉన్న మోటారు దొంగిలించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

దర్యాప్తు చేస్తున్నాం..



దొంగతనం జరిగిన సంఘటనలపై దర్యాప్తు చేస్తున్నాం. ఖచ్చితంగా దొంగలను పట్టుకుంటాం. క్లూస్ టీం పూర్తి స్థాయిలో ఆధారాలు ఇచ్చాక మరింత లోతుగా దర్యాప్తు చేస్తాం. కొత్తవారు ఎవరైనా వస్తే గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అదే విధంగా దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

- వెంకటేష్, ఎస్‌ఐ

సమస్యలు పరిష్కరించండి



టీజీఎంఎఫ్‌సీ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు వినతిపత్రం ఇస్తున్న అల్‌ఫైజ్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు అల్‌ఫైజ్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఉర్దూ మీడియం పాఠశాలలను అభివృద్ధి చేయాలని అల్ ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్ బాబా కోరారు. మౌలిక వసతుల కల్పన, శ్వాశత భవనాలు, డిజిటల్ బోర్డులు, మసీదుల్లో లైబ్రరీలు ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జహంగీర్‌బాబా, మహ్మద్ యాకుబ్, సభ్యుడు మహెమూద్ ఉన్నారు.

భూత్పూర్ మునిసిపాలిటీని తీర్చిదిద్దుతా



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్

భూత్పూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే లక్ష్యంగా భూత్పూర్ మునిసిపాలిటీని తీర్చి దిద్దుతామని మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్ అన్నారు. బుధవారం మునిసిపాలిటీలోని అమిస్తాపూర్ 6వ వార్డులో ఇంటింటా తిరుగుతూ.. మీ ఇంటికి మేము వచ్చాము.. మీ సమస్యలు ఏమైన ఉంటే చెప్పండి పరిష్కరిస్తాం అంటూ కమిషనర్ ప్రజలకు భరోసా ఇచ్చారు. కాలనీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త బండి వచ్చినప్పుడు వేయాలని ప్రజలకు సూచించారు. వర్షాకాలంలో ప్రతీ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని కోరారు. ప్రభుత్వం మునిసిపాలిటీ అభివృద్ధికి 10 వార్డులకు సంబంధించి రూ.3 కోట్లు మంజూరు చేసిందని, ఈ నిధులతో కాలనీలను సుదరంగా తీర్చి దిద్దడం జరుగుతుందని కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పద్మ, మాజీ సర్పంచ్ చెన్నమ్మ, మట్టి ఆనంద్, మునిసిపల్ మేనేజర్ నరసింహ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

భూత్పూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎంపీడీవో ప్రభాకర్‌చారి, కమిషనర్ నురూల్ నజీబ్, మండల వైద్యాధికారి అబ్దుల్‌రబ్ బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి, గ్రామస్థాయి అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని నిర్ణయించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ప్రభాకర్‌చారి వైద్య సిబ్బందికి సూచించారు. మునిసి పాలిటీల్లో మునిసిపల్ సిబ్బంది పారిశుధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండేలా చూడాలని కమిషనర్‌కు మండల వైద్యాధికారి అబ్దుల్ రబ్ సూచించారు.

చట్టసభల్లో మహిళలకు అవకాశం కల్పించాలి



మహిళా సంఘం వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

పాలమూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని, మహిళలపై నిత్యం జరుగుతున్న దాడులను అరికట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి కె.పద్మావతి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో మహిళా సంఘం 71వ వ్యవస్థాపక దినోత్సవ సంబురాలకు ఆమె పాల్గొని, మాట్లాడారు. పాలక వర్గాలు, రాజకీయ పార్టీలు మాటల్లో మహిళలను మభ్యపెట్టకుండా చిత్తశుద్ధితో చట్టసభల్లో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. మహిళల హక్కుల సాధనకు భారత జాతీయ మహిళా సమాఖ్యను 1954లో జూన్ 4న కలకత్తా నగరంలో స్థాపించినట్లు తెలిపారు. ఆనాడు మహిళలను మనుషులుగా చూడకపోవటంతో అణచివేతలు, అవమానాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అరుణ అసఫ్‌అలీ, రేణుచక్రవర్తి, అజారాబేగం, విమలాఫరూఖీ, గీతా ముఖర్జీ లాంటి ఎందరో వీర వనితలు మహిళా సంఘం ఏర్పడిందన్నారు. సమాజంలో పేరుకుపోయిన సనాతన భావాలకు, మూఢనమ్మకాలు, సంఘం సంస్కరణకు కృషి చేసిందని తెలిపారు. పురుషాధిక్య సమాజంలో మహిళలు అడుగడుగున సామాజిక అణచివేతకు గురవుతున్నారని గాయని శ్యామల అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్, సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.భార్గవి, బి.ఇందిరా, సింధూజ, మాధవి, అనన్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

భూత్పూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రంలోని 10వ వార్డుకు చెందిన అనుప చంద్రశేఖర్ గత నెల 23న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ.. అదే నెల 28న మృతి చెందాడు. మృతుడు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వంట మనిషిగా పనిచేసేవాడు. మండలంలోని మద్దిగట్ల పాఠశాల ఉపాధ్యాయుడు సత్తూరు బాలరాజుగౌడ్ చంద్రశేఖర్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను కోరారు. స్పందించిన భూత్పూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దస్తయ్య, ఉపాధ్యాయులు యాదయ్య, పద్మమ్మ, పద్మావతి, రమాదేవి, నిరజ, నాగజ్యోతి, అటెండర్ జ్ఞానేశ్వర్, కలిసి రూ.50 వేలు బుధవారం మృతుడి భార్యకు అందజేశారు. అదే విధంగా పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు బాలరాజు గౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు సురేష్‌రెడ్డి, సాయిరాంగౌడ్ కలిసి రూ.50 వేలు అందించారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

పాలమూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో మొదటి నవరత్నాల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోర్సు (3 నెలలు)ల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పర్యవేక్షకులు గుండా మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి సొంత నిధులతో మహిళలకు వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులకు కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ తయారీ, బ్యూటీషియన్, మగ్గం వర్క్ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఈనెల 15 వరకు దర ఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

వానాకాలం పంటల సాగుపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

చిన్నచింతకుంట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వానాకాలంలో పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని భారత నూనె గింజల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు సురేష్ కుమార్, దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ అవగాహన సదస్సులో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు వానాకాలం పంటలపై అవగాహన కల్పించారు. నూనె గింజల పంటలైన ఆముదం, పొద్దు తిరుగుడు, వేరుశనగ, సాగు సమస్యలపై అవగాహన కల్పిస్తూ డీసీహెచ్-519, ఐసీహెచ్-66, ఐసీహెచ్-5 విత్తనాలను సాగు చేయాలని తెలిపారు. కేవీకే మదనాపురం ప్రధాన శాస్త్రవేత్త రాజేంద్ర రెడ్డి వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం, పచ్చి రొట్ట ఎరువుల ప్రాముఖ్యత, జీవన ఎరువుల వాడకం, సేంద్రీయ వ్యవసాయం, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాల సాగు ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఏవో రాజేష్ ఖన్నా, ఏఈవోలు అనిల్ కుమార్‌రెడ్డి, తిరుపతయ్య, శాంసన్, మౌనిక, చంద్రకళ, అనిత పాల్గొన్నారు.